# సాక్షి కర్నూలు

గురువారం । 23 । నవంబర్ । 2023




## కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల కొన సాగుతోంది. బుధవారం 1,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



## నిత్యాన్నదానానికి విరాళాలు

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి మాన్యం జిల్లాకు చెందిన ఎం.పద్మలత రూ.1,00,521, హైదరాబాద్‌కు చెందిన సీవీఎస్ సుబ్రహ్మణ్యం రూ.1,01,000 విరాళమిచ్చారు.



## అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీశైలంలో చెన్నైకి చెందిన గీతా గణేషన్ బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది.

## న్యూస్‌రీల్

### హంద్రీనదికి జీడీపీ నీరు విడుదల



జీడీపీ నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: వర్షాభావ పరిస్థితుల వల్ల హంద్రీనది ఎండిపోవడంతో కోడుమూరు నదీ పరివాహక ప్రాంతాలైన కోడుమూరు, వర్కూరు, గోరంట్ల గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తింది. నీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీనదికి నీటిని విడుదల చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జిల్లా అధికారులను కోరగా, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు బుధవారం జీడీపీ నీటిని ఎల్ఎల్‌సీ ద్వారా వర్కూరు శుద్దవాగు మీదుగా హంద్రీనదిలోకి విడుదల చేశారు. నీటి విడుదలను కోడుమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్ పరిశీలించారు.

### గూడూరులో ఉల్లి, టమాట సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఉల్లి, టమాట సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు కసరత్తు జరుగుతోంది. ఇక్కడ ఉల్లి గోదాముతో పాటు ఇతర గోదాములు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు అవసరమైన భూమిని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి స్వాధీనం చేసేందుకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ జిల్లా అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ప్రతిపాదనలు పంపారు. రెండు ఉల్లి గోదాములు, సీసీ రోడ్డు, 600 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గోదాములు, ఎకరా స్థలం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి స్వాధీనం చేసేందుకు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి ప్రతిపాదనలు పంపారు. మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వీటిని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి అప్పగించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నారు. యూనిట్ ఏర్పాటయితే ఉల్లి, టమాట దిగుబడులకు మంచి గిరాకీ వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### మండలాలకు పవిత్ర అక్షింతల పంపిణీ



అక్షింతలతో మండలాల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణం పూర్తి కాబోతున్న నేపథ్యంలో జిల్లా కేంద్రాలకు చేరుకున్న భగవాన్ శ్రీరామ్ లల్లా విరాజ్ మాన్ వేద మంత్రాలతో పూజించిన పవిత్ర అక్షింతలను జిల్లాలోని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేశారు. బుధవారం వినాయక్ ఘాట్‌లో అక్షింతలకు పూజలు చేసి 9 రెవెన్యూ మండలాలు, నగరంలోని 616 డివిజన్ల ప్రతినిధులకు అందజేశారు. వీహెచ్‌పీ సహ కార్యదర్శి ప్రాణేష్, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, కోశాధికారి సందడి మహేష్‌లు అతిథులుగా హాజరై అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి భాను ప్రకాష్, సహ కార్యదర్శి గోవింద రాజులు, జిల్లా కోశాధికారి శ్రీనివాస రెడ్డి, నగర అధ్యక్షులు మద్దిలేటి, నగర కార్యదర్శి నాగరాజు, జిల్లా మాతృ శక్తి సంయోజిక సంపాల రాధిక తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం కావాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణిలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేటట్లు చూడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన బి.క్యాంపు, ఎఫ్‌సీఐ కాలనీ, డాక్టర్స్ కాలనీ సచివాలయాల్లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను ముందుగానే ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయించి, హైరిస్క్ ఉన్న వారిని మూడు రోజుల ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలని సూచించారు. అనంతరం వారికి ఐరన్ మాత్రలు, పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరప్‌లు పంపిణీ చేశారు. బుధ, శనివారాల్లో పదేళ్లలోపు పిల్లలకు ప్రత్యేక టీడీ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించి టీకాలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహాలక్ష్మి, డీసీఎం ప్రసాద్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

# ఇంటి తోట.. ఆనందాల పంట

- పెరుగుతున్న టెర్రస్ గార్డెన్‌లు, ఇంటితోటలు
- ఉమ్మడి జిల్లాల్లో 1,000కి పైగా ఇళ్లపై నందనవనాలు
- జీవన శైలీని మార్చుకుంటున్న నగర, పట్టణ వాసులు
- కరోనా తర్వాత కర్నూలుతో సహా పలు పట్టణాల్లో టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధి
- రసాయన రహితంగా పండ్లు, పూలు, కూరగాయలు, ఆకు కూరల పెంపకం

నగరవాసుల జీవనశైలీ మారుతోంది. ప్రకృతి అందాలపై ఆసక్తి పెరుగుతోంది. బయటికి వెలితే వాయు, శబ్దకాలుష్యంతో సతమతమవుతున్న తరుణంలో ఇంటి ఆవరణ, ఇంటిపైనే.. అవకాశం ఉన్న ప్రతి చోటా మొక్కలు పెంచుతూ.. ప్రకృతి అందాలను, ఆనందాలను సృష్టించుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు హైదరాబాద్ వంటి నగరాలకు పరిమితమైన ఇంటి పంట, టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధి కరోనా సమయం నుంచి జిల్లాలకు విస్తరించింది.



ఇంటిపై కనువిందు చేస్తున్న గార్డెన్, (ఇన్‌సెట్‌లో) ఇంటిపైన పండించిన తాజా కూరగాయలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరానికి పరిమితమైన టెర్రస్ గార్డెన్, పెరటితోటలు, ఇంటి పంటల అభివృద్ధి ఇపుడు వివిధ పట్టణాలకు కూడా విస్తరిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,000కి పైగా కుటుంబాలు టెర్రస్ గార్డెన్, ఇంటి పంట, పెరటితోటలు అభివృద్ధి చేసుకుని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో పెరటితోటల అభివృద్ధికి స్థలాల కొరత ఉంటోంది. దీంతో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి ద్వారా పచ్చదనం అభివృద్ధి చేసుకుంటున్నారు. ఉద్యమ తరహాలో ఇంటిపైనే నందనవనాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ప్లాస్టిక్ టబ్బులు, పాత బకెట్‌లు, సిమెంటు తోట్లు, ప్లాస్టిక్ సంచులు తదితర వాటితో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకుంటున్నారు. మార్కెట్లలో లభించే కూరగాయలు, ఆకుకూరలకూ కెమికల్స్ వినియోగిస్తుండటంతో నగర, పట్టణ ప్రజల ఆలోచన విధానంలో మార్పులు వచ్చాయి. ఇంటిపైనే అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్ల మొక్కలతో గార్డెన్ అభివృద్ధి చేసుకుంటున్నారు.

**టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధిపై అతివల ఆసక్తి**

కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, బనగానపల్లె, డోన్ తదితర పట్టణాల్లో మహిళలు టెర్రస్ గార్డెన్, ఇంటిపంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధి, వాటిల్లో పని చేయడం, నీళ్ల కట్టడం వంటి పనులతో కాలం గడుపుతున్నారు. దీంతో శరీరానికి తగిన వ్యాయామం కూడా లభిస్తోంది. తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు వినియోగిస్తూ ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. మొక్కలకు వర్మీకంపోస్టు, చెరువు మట్టి, వేపచెక్క, వేపకషాయం వంటి వాటిని వినియోగిస్తున్నారు. చీడపీడలను వేప ఉత్పత్తులతో నివారించుకుంటున్నారు.

**ఒకరికొకరు తోడుగా..**

టెర్రస్ గార్డెన్లు ఉన్నవారందరు కలిసి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అందులో ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుంటున్నారు. పూలు, కూరగాయలు, పండ్ల మొక్కల్లో బాగ వచ్చినవి, పండిన వాటి వివరాలను గ్రూపుల్లో పోస్టు చేస్తూ అందరికి పంచుతూ... ఆనందం పొందుతున్నారు. కర్నూలు నగరంలో దాదాపు 500 మంది, ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాల్లో మరో 500 మంది టెర్రస్ గార్డెనింగ్‌లో రాణిస్తున్నారు. కర్నూలు టెర్రస్ గార్డెనర్స్ వాట్సాప్ గ్రూపు, సిటీ టెర్రస్ గార్డెనర్స్ గ్రూపులు ప్రాచుర్యంలో ఉన్నాయి. ప్రతి నెల లేదా 2 నెలలకోసారి వాట్సాప్ గ్రూపు సభ్యులు సమావేశమై టెర్రస్ గార్డెన్ అభివృద్ధితోపాటు కొత్త మొక్కలు తెప్పించడం, చీడ, పీడలు, వాటి నివారణ తదితర వాటిపై చర్చిస్తారు.

**కొత్త, కొత్త రకాలు..**

రకరకాల మొక్కలు టెర్రస్ గార్డెన్‌లలో కనువిందు చేస్తున్నాయి. అనేక రకాల కూరగాయలు మొక్కలు, మల్లె, మందారం, గులాబీల్లో పదుల సంఖ్యలో రకాలు, రణపాల, అశ్వగంధ, నూరువరహాలు, స్టార్‌ఫ్రూట్స్, మల్బరీ ఫ్రూట్స్, అంజూరు, డ్రాగన్ ఫ్రూట్స్, ఆడినియం ఇలా వందల రకాలతో టెర్రస్ గార్డెన్‌లు సాకారం అవుతున్నాయి. మొక్కలు ఏపుగా పెరుగడంతో పాటు అధిక ఫలసాయాన్ని ఇచ్చేందుకు కిచెన్ వ్యర్థాలను కంపోస్టు ఎరువులుగా మార్చి ఇస్తున్నారు. పశువుల ఎరువులు. వర్మికంపోస్టు వంటి వాటిని వినియోగిస్తున్నారు. మొక్కలకు హాని చేసే పురుగులను చేతులతోనే ఏరివేస్తున్నారు.



కల్లూరు మండలం పెద్దటేకూరుకు చెందిన తోట హరికృష్ణ కొన్నేళ్లుగా వర్మీకంపోస్టు ఎరువు తయారీలో రాణిస్తున్నారు. ప్రకృతి పట్ల అపారమైన అభిమానమున్న ఈయన కర్నూలులో టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధికి పాటుపడుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలను కలుస్తూ సాంకేతిక పరిజ్ఞానం పెంచుకొని టెర్రస్ గార్డెనింగ్‌లో రాణిస్తున్న వారికి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇంటిపైన తోటల అభివృద్ధికి ముందుకు వచ్చే వారికి అవసరమైన మట్టి, కోకోపీట్, వర్మీకంపోస్టు, వేపపిండి, వేప చెక్క, చీడపీడల నివారణకు అవసరమైన కషాయాలు సరఫరా చేస్తున్నారు. నెలకోసారి టెర్రస్ గార్డెనర్లు సమావేశమై చర్చించుకొని మరింత అద్భుతంగా రాణించేందుకు దోహదపడుతున్నారు.



పూలను చూపుతున్న ఈ మహిళ పేరు సుష్మ. లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త షరాఫ్ బజారులో జ్యువెలరీ మేకర్‌గా పని చేస్తున్నారు. ఇంటి పైన 150 వెరైటీలతో పండ్లు, కూరగాయలు, తీగజాతి కూరగాలు, ఆకు కూరలు, పూలు, ఔషధ మొక్కలు పెంచుతున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా టెర్రస్ గార్డెన్‌లో పనిచేస్తారు. ఆదివారం మొత్తం టెర్రస్‌పై గార్డెన్ అభివృద్ధికే కేటాయిస్తున్నారు. రెండేళ్ల క్రితం టెర్రస్ గార్డెన్‌కు శ్రీకారం చుట్టగా ప్రస్తుతం వంటకు అవసరమైన అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు పండుతున్నాయని, అలాగే మానసిక ఆనందం కూడా పొందుతున్నానని సుష్మ వివరించారు.



మొక్కల మధ్య సేద తీరుతున్న ఈ మహిళ పేరు సుహాసిని. నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలోని అపార్టుమెంట్‌లో నివసిస్తున్నారు. ఎమ్మెస్సీ, బీఈడీ, పీహెచ్‌డీ చేసిన సుహాసిని.. రాయలసీమ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తక్కువ స్థలంలోనే పలు రకాల మొక్కలతో పచ్చదనాన్ని అభివృద్ధి చేసుకున్నారు. మందార, గులాబీ, నూరువరహాలు, నాటు గులాబీ, సెంట్ గులాబీ, హైబ్రిడ్ గులాబీ, డబుల్ మల్లె, అనేక రకాల క్రోటన్స్, కోలియస్(రంగు, రంగుల ఆకులు), అగ్లోనిమా, బ్రోకన్‌హార్ట్, స్నేక్‌ప్లాంట్స్, తులసీలు, రేగు చెట్టు తదితర వాటితో గార్డెన్ అభివృద్ధి చేసుకున్నారు. విధి నిర్వహణలో ఒత్తిడికి గురైనపుడు మొక్కలకు సంబంధించిన పనులు చేయడం ఆనందాన్ని ఇస్తుందని ఆమె చెబుతోంది.

**మొక్కల పెంపకం నా హాబీ**



మొక్కలు, తోటల పెంపకం నా హాబీ. అందుకే ఇంటిపైన 1,000 అడుగుల స్థలంలో వంద రకాల మొక్కలు పెంచాను. అందులో ఆడినియంలో 11, ఆల్ మండలో 5, మందారాల్లో 20, డ్రాగన్ ఫ్రూట్స్ 3, గులాబీల్లో 10, తులసి 5 రకాలతో పాటు రణపాల, అశ్వగంధ, దానిమ్మ, సపోట, మల్బరీ, నిమ్మ, జ్యూస్ నిమ్మ, స్వీట్ నిమ్మ మొక్కలతో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేస్తున్నాం. మొక్కలకు కిచెన్ వ్యర్థాలను ఎరువులుగా వేస్తున్నా. – స్వర్ణలత, బనగానపల్లె

## కేఎంసీ హాస్టల్‌లో నలుగురు విద్యార్థుల బహిష్కరణ

- మరో ఐదుగురు ఆరు నెలల పాటు హాస్టల్‌కు దూరం

కర్నూలు(హాస్పిటల్): మత్తు పదార్థాలు సేవించినందుకు కర్నూలు మెడికల్ కాలేజి మెన్స్ యూజీ హాస్టల్ నుంచి నలుగురు విద్యార్థులను బహిష్కరిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ చర్యలు తీసుకున్నారు. వీరితో పాటు మద్యం సేవిస్తున్నారనే అభియోగంపై మరో ఐదుగురు విద్యార్థులను ఆరు నెలల పాటు హాస్టల్ నుంచి తొలగించారు. మెన్స్ మెడికల్ హాస్టల్‌లో ఈ నెల 17న అర్ధరాత్రి హాస్టల్ వార్డెన్‌లు ఆకస్మికంగా తనిఖీలు చేయగా ఆ సమయంలో ఇద్దరు వైద్య విద్యార్థులు మత్తు పదార్థాలు సేవిస్తూ పట్టుబడ్డారు. త్రిసభ్య కమిటీ విచారణ అనంతరం ఒక విద్యార్థి గత కొంత కాలంగా మత్తు మందుకు బానిసైనట్లు గుర్తించారు. మరో విద్యార్థి కూడా మత్తు మందు సేవిస్తున్నట్లు వెల్లడైంది. విచారణలో మరో ముగ్గురు విద్యార్థులు గతంలో వీరితో మత్తు మందు సేవించినట్లు తెలిపారు. తనిఖీలో మరికొంత మంది విద్యార్థులు మద్యం సేవిస్తున్నట్లు వార్డెన్లు గుర్తించారు. ఈ మేరకు సంబంధిత విద్యార్థులను హాస్టల్ నుంచి పంపించి వేస్తున్నట్లు చర్యలు తీసుకున్నారు. కాగా జరిగిన ఉదంతంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. దోషులుగా నిర్ధారించిన తర్వాత వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు.

## 27న టమాట ప్రాసెసింగ్ యూనిట్ భూమి పూజ

- వర్చువల్ మోడ్‌లో భూమి పూజ నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రూ.12.05 కోట్లతో ఏర్పాటుకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. సమీకృత టమాట ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ఇటీవల ఉత్తర్వులు జారీ ప్రభుత్వం.. తాజాగా భూమి పూజకు చర్యలు చేపట్టడం విశేషం. ఈ నెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ మోడ్‌లో నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవికి సమాచారం వచ్చింది. పత్తికొండ సమీపంలోని సర్వే నెంబర్ 286/1ఏ3, 286/1ఏ4, 286/1ఏ5ల్లోని 3.60 ఎకరాల్లో టమాట ప్రాసెసింగ్ సెంటర్ రూ.12.05 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఈ భూమిని ప్రభుత్వం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి అడ్వాన్స్ పొజిషన్ కూడా ఇవ్వడం విశేషం. పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ, ప్యాపిలి, క్రిష్ణగిరి, తుగ్గలి, పెద్దకడుబూరు, హాలహర్వి, ఆదోని, కోడుమూరు, ఓర్వకల్, కల్లూరు, వెల్దుర్తి తదితర మండలాల్లో టమాట విస్తారంగా సాగు అవుతోంది. పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అనేది దశాబ్దాల కల. రైతులను కలను సాకారం చేస్తూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయనుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## జనవరి 26 వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

- జిల్లాలో 484 గ్రామ పంచాయతీల్లో నిర్వహణకు ఏర్పాట్లు చేయండి
- ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చడమే యాత్ర ముఖ్య ఉద్దేశం
- అధికారుల సమీక్షలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రత్యేక పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రత్యేక పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 25 నుంచి జనవరి 26వ తేదీ వరకు జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపట్టడానికి ఏర్పాట్లు చేయాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రత్యేక పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణపై జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులు, ఐఆర్ఎస్ అధికారి, కేంద్ర ప్రభుత్వ కుటుంబసంక్షేమ మంతిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ కిరణ్‌కుమార్.. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలసి అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో యాత్ర కొనసాగనుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడమే యాత్ర ఉద్దేశమని తెలిపారు. యాత్ర నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గా 36 శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ అధ్యక్షుడిగా 10-12 మంది అధికారులతో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకు ప్రచారం నిమిత్తం 4 వ్యాన్లు రానున్నాయని, వాటి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కలిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆయుష్మాన్ భారత్, పీఎం ఉజ్వల, కేసీసీ, పేదలకు ఉచిత గృహాలు, తదితర పథకాలకు అర్హులై ఉండి లబ్ధి పొందకపోతే వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ జిల్లాకు ప్రచారం నిమిత్తం నాలుగు వ్యాన్లు రానున్నాయని, మొదట 25న గోనెగండ్ల, 26న గూడూరు, 27న ఓర్వకల్లు, 28న తేదీన కల్లూరు మండలాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు ప్రారంభమవుతాయన్నారు. భారత్ వికసిత్ సంకల్ప యాత్రను జిల్లా అధికారులు పట్టుదలతో విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## 27న విభిన్న ప్రతిభావంతులకు ఆటలపోటీలు

కర్నూలు(అర్బన్): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగుల) దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయిలో ఆటలపోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో ఆసక్తి కలిగిన శారీరక విభిన్న ప్రతిభావంతులు, బధిరులు, అంధులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించాలన్నారు. ఆటల్లో పాల్గొనే అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, వికలత్వ ధృవీకరణ పత్రం(సదరం) నకలుతో 27న ఉదయం 8 గంటలకు అవుట్‌డోర్ స్టేడియం కర్నూలులో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 08518- 277864 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



## సంక్షేమ బావుటా








### ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి

టీడీపీ హయాంలో పింఛన్ తీసుకోవడానికి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి ఉండేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మాలాంటి వారి కష్టాలు తొలగాయి. దివ్యాంగులందరికీ పింఛన్ రూ.3 వేలు పెంచి ఎంతో మేలు చేశారు. ప్రతి నెలా ఠంచన్‌గా ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తున్నారు. మంచి చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని కోరుకుంటున్నా.

– బోయ యంకమ్మ, గుడేకల్ గ్రామం, ఎమ్మిగనూరు మండలం

### విలువైన ఆస్తి ఇచ్చారు

రెండెకరాల్లో పంటలు వేసుకుంటూ కూలీనాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నాం. సొంతిల్లు లేక మా అమ్మ వాళ్ల పాత ఇంట్లోనే ఉండేవాళ్లం. గతంలో ఎన్నోసార్లు నాయకులు, అధికారులను ఇల్లు మంజూరు చేయాలని కోరినా ఫలితం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలో మాకు సెంటున్నర స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి మెటీరియల్, నగదు ఇచ్చింది. ఇల్లు పూర్తి చేసుకుని అందులో చేరాం. విలువైన ఆస్తిని ఇచ్చిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– బోయ అంజినమ్మ, రాతన గ్రామం, తుగ్గలి మండలం

## జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో పీఈటీ కళ్యాణి

పాములపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేక అధికారిణి రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ అండర్ 18 విభాగంలో ఇంద్రాణి, అండర్ 16 విభాగంలో తస్వీర్ ఫాతిమా బేగం, అండర్ 14 విభాగంలో సుమకీర్తిలు ఎంపికయ్యారని వివరించారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల పీఈటీ కళ్యాణి టీం మేనేజర్‌గా ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థినులను, పీఈటీని ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## కొండజూటూరులో చోరీ

పాణ్యం : మండల పరిధిలోని కొండజూటూరు గ్రామంలో చోరీ జరిగినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన సుమలతకు చెందిన ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు జొరబడి బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.1లక్ష 50వేల నగదు దొంగిలించారన్నారు. ఉదయాన్నే బీరువా వద్దకు వెళ్లి చూడగా అందులో ఉన్న నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



# పేదింట కళ్యాణమస్తు!

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా
- జిల్లాలో 446 మంది అమ్మాయిలకు రూ.3,72,80,000
- ముస్లిం మైనార్టీలకు వైఎస్ఆర్ షాది తోఫా... ఇతరులకు వైఎస్సార్ కల్యాణమస్తు
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా 4వ విడత 'కల్యాణమస్తు'కు శ్రీకారం



కర్నూలు (అగ్రికల్చర్): పేదింటి మహిళలకు ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫాతో అండగా నిలుస్తోంది. వివాహం ఖరీదైనదిగా మారిన నేపథ్యంలో వారికి ఆర్థికంగా భరోసానిస్తోంది. ఇల్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. రెండింటిలో ఏదీ చేసినా జేబు ఖాళీ అవ్వాల్సిందే. నేడు వివాహం అంటే రూ.లక్షలతో కూడిన వ్యవహారం. దీంతో ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలు, దివ్యాంగులకు వైఎస్సాఆర్ కల్యాణమస్తు, ముస్లింలకు వైఎస్సార్ షాదీతోఫా పేరుతో ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి ఇప్పటి వరకు మూడు పర్యాయాలు ఆర్థిక సాయం చేసింది. నాలుగో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి మహిళల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా జమ చేయనున్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన వారందరికి కల్యాణమస్తు, షాదీతోఫా కింద ఆర్థిక సాయం అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ-వైకేపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించనున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

### జిల్లాలో 446 మందికి లబ్ధి

జిల్లాలో కల్యాణమస్తు, షాదీతోఫా కింద ముస్లిం మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాలు, దివ్యాంగుల కుటుంబాలకు చెందిన 446 మహిళలకు ఆర్థిక సాయం అందనుంది. కల్యాణమస్తు, షాదీతోఫా కింద జిల్లాలో రూ.3.72 కోట్లు నేరుగా డీబీటీ ద్వారా మహిళల బ్యాంకు ఖాతాలకు జమ కానుంది. బీసీల్లో 167 జంటలకు, వికలాంగులకు సంబంధించి నాలుగు జంటలకు, ముస్లిం మైనార్టీలకు సంబంధించి 83 జంటలకు, ఎస్సీల్లో 184 జంటలకు, ఎస్టీల్లో 8 జంటలకు ఈ ప్రయోజనం కలగనుంది.

**కర్నూలు జిల్లాలో మూడు విడతల్లో లబ్ధిపొందిన వారి వివరాలు**

| విడత | ప్రయోజనం పొందిన లబ్ధిదారులు | ఆర్థిక సహాయం (రూ.లో) |
|---|---|---|
| 1వ విడత | 271 | 2,31,40,000 |
| 2వ విడత | 574 | 4,26,35,000 |
| 3వ విడత | 1076 | 8,61,05,000 |
| 4వ విడత | 446 | 3,72,80,000 |
| మొత్తం | 2,367 | 18,91,60,000 |

### పారదర్శకంగా అర్హుల ఎంపిక

కల్యాణమస్తు, షాదీతోఫా పథకానికి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేశాం. అర్హత కలిగిన వారందరికీ న్యాయం చేశాం. జిల్లాలో 446 మంది మహిళలకు అర్హత లభించింది. వీరి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా రూ.3.72 కోట్ల నగదు జమ కానుంది.
– సలీం బాషా, పీడీ, డీఆర్‌డీఏ-వైకేపీ, కర్నూలు

## క్లుప్తంగా

### 27న 'సామూహిక ఒడిబియ్యం'


ఒడిబియ్యం సామగ్రితో సంతాన పూజ చేస్తున్న అర్చకులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27న సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ సంతానం లేని వివాహితులకు సంతాన సాఫల్యుడిగా పేరుగాంచిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి సన్నిధిలోసాముహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రెండు వేలకు పైగా వివాహితులు హాజరయ్యే అవకాశముందని అంచనా వేసి ఆమేరకు చీరె, జాకెట్, పసుపు, కుంకుమతో పాటు ఒడి బియ్యం సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు కిట్టయ్య, శరభయ్య పాల్గొన్నారు.

### 25న నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పరిధిలోని నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యనిర్వాహకులు నాగపుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని త్యాగరాజ స్వామి దేవస్థానం ఆవరణలో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోనే 2022-23 విద్యాసంవత్సరంలో అత్యంత ప్రతిభ కనపరిచి పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు.. జేఈఈ, నీట్, సీఏ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన నాయిబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు.వివరాలకు 70138 56031, 94900 11585 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

### గ్రావెల్ టిప్పర్ సీజ్


సీజ్ చేసిన టిప్పర్

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం తడకనపల్లె గ్రామ శివారు నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. తడకనపల్లె రోడ్డులో ఎర్రమట్టి తరలిస్తున్నారనే సమాచారంతో మైనింగ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. టిప్పర్‌లో ఎర్రమట్టిని గుర్తించి ఆరా తీయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే వెల్దుర్తి మండలం అమకతాడు టోల్‌ప్లాజా సమీపంలో పొలాల చదును పేరుతో అక్రమంగా గ్రానైట్ రాళ్లు వెలికి తీస్తున్న ప్రాంతాన్ని కూడా సీజ్ చేసినట్లు డీడీ తెలిపారు.

### కేసీలో విద్యార్థి గల్లంతు


దేవేంద్ర(ఫైల్)

పగిడ్యాల: ముచ్చుమర్రి క్రాస్ రెగ్యులేటర్ల వద్ద కేసీ కాలువలో బుధవారం బాబాయ్‌లతో కలిసి ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన కళ్యాణి, కృష్ణ దంపతుల కుమారుడు సూర్యం దేవేంద్ర(13) ఆత్మకూరు పట్టణంలోని కప్పలకుంట హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. అవ్వతాతల వద్ద ఉండి చదువుకుంటున్న దేవేంద్ర కొద్ది రోజుల క్రితం తల్లిదండ్రులను చూసేందుకు కొత్త ముచ్చుమర్రికి వచ్చాడు. సాయంత్రం బాబాయ్‌లతో కలిసి కేసీ కాలువకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ అందులో పడి గల్లంతయ్యాడు. పోలీసుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

## సుదర్శన హోమం.. భక్తి పారవశ్యం


పూర్ణాహుతి చేస్తున్న అహోబిల ఆలయ అర్చకులు


హోమంలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: నృసింహ దాస కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలమూరులో సుదర్శన హోమం నిర్వహించారు. ముందుగా నరసింహస్వామి, సుదర్శన మూర్తి చిత్ర పటాలకు పూజలు చేశారు. పుణ్యాహవచనం అనంతరం రక్షా కంకణాలకు పూజలు చేసి భక్తులకు అందజేశారు. శ్రీసూక్త, పురుషసూక్త సహిత సుదర్శన మంత్ర జప హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ముగియగానే పూర్ణాహుతి గావించారు. ఆయా కార్యక్రమాల్లో అహోబిల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, మధు, సౌమ్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

## ఓటరు జాబితాలోని పొరపాట్లను సరిచేసేందుకు చర్యలు

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో కె.మధుసూదనరావు

కర్నూలు(సెంట్రల్): ముసాయిదా ఓటరు జాబితాలోని పొరపాట్లను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో కె.మధుసూదనరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన చాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓల తోపాటు ఇంటింటా సర్వేలో పాల్గొనాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని, చనిపోయినవారి ఓట్లను పంచనామా చేసి తొలగిస్తామన్నారు. . కాగా, రాజకీయపార్టీల ప్రతినిధులు అడిగిన సమాచారాన్ని వారికి అందజేయాలని, ప్రత్యేక ఓటరు అవగాహన కార్యక్రమాన్ని డిసెంబర్ 2,3తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. కర్నూలుకు సమీపంలోని తెలంగాణ జిల్లాల్లో వారికి కర్నూలు జిల్లాలో ఓటు అక్కడ..ఇక్కడ ఉంటే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 27న ఓటరు జాబితా పర్యవేక్షకులు మురళీధర్‌రెడ్డి ఎన్నికల ఏర్పాట్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం కానున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నుంచి రాష్ట్ర న్యాయ విభాగం కార్యదర్శి పుల్లారెడ్డి, టీడీపీ తరపున ఎల్‌వీ ప్రసాదు, ఆమ్‌ఆద్మీ నుంచి మహ్మద్ అక్బర్, బీజేపీ నుంచి పీటీ సాయి ప్రసాదు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులో సమావేశమైన డీఆర్వో కె.మధుసూదన్‌రావు

## ఉమ్మడి జిల్లాలో 9 పోలీస్‌స్టేషన్ల స్థాయి పెంపు

కర్నూలు: శాంతి భద్రతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9 పోలీస్ స్టేషన్లను పూర్తిస్థాయి పోలీస్‌స్టేషన్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో దేవనకొండ, గోనెగండ్ల, ఓర్వకల్లు, కౌతాళం, ఆస్పరి, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, ఆత్మకూరు, కొలిమిగుండ్ల, శ్రీశైలం టూటౌన్ పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ నం .192 విడుదల చేశారు. ఇకపై సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఆయా స్టేషన్లు కొనసాగనున్నాయి. 9 పోలీస్ స్టేషన్లను పూర్తిస్థాయి పోలీస్‌స్టేషన్లుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల క్రైం గ్రాఫ్‌ను నియంత్రించడంలో దోహదపడుతుందని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలు ఇటీవల సీఐలుగా పదోన్నతి పొంది పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. వారిని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్లకు నియమించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

## అయ్యప్ప మాలధారుడి గల్లంతు

పత్తికొండ రూరల్: పత్తికొండ-ఆదోని రోడ్డులోని హంద్రీనీవా కాలువ వద్ద స్నానం చేసేందుకు వెళ్లి కాలువలోకి దిగిన అయ్యప్ప మాలధారుడు బుధవారం రాత్రి గల్లంతయ్యాడు. తమిళనాడు రాష్ట్రం సేలం సమీపంలోని సింగిరి గ్రామానికి చెందిన కార్తీక్ చెన్నై నుంచి బీజాపూర్‌కు పెయింట్ లోడు లారీ డ్రైవర్‌గా బయల్దేరాడు. మాలధారుడు కావడంతో పత్తికొండ సమీపంలోని హంద్రీనీవా కాలువలోకి స్నానానికి దిగాడు. నీటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నా చీకటి పడటంతో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. క్లీనర్ అరస కుమార్ డ్రైవర్ వివరాలు విలేకరులకు తెలిపాడు.

## రగ్బీ విజేతలు నెల్లూరు, గుంటూరు జట్లు


విజేతగా నిలిచిని నెల్లూరు బాలుర జట్టు


ట్రోఫీ అందుకుంటున్న గుంటూరు బాలికల జట్టు

- కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న కర్నూలు బాల, బాలికల జట్లు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్-19 బాల, బాలికల స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో నెల్లూరు, బాలికల విభాగంలో గుంటూరు జట్లు విజేతలకు నిలిచాయి. బాలుర విభాగంలో రెండవ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో కర్నూలు జట్టు, బాలికల విభాగంలో రెండవ స్థానంలో అనంతపురం, మూడవ స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా ఆదర్శ విద్యా సంస్థల సంచాలకులు డాక్టర్ హరికిషన్ మాట్లాడుతూ రగ్బీ క్రీడాభివృద్ధికి తమ ఆదర్శ విద్యా సంస్థలు ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని, అవకాశాలను వినియోగించుకుని క్రీడాకారులు మంచి ప్రతిభ చాటాలని సూచించారు. అనంతరం విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, పోటీల పరిశీలకులు రమేష్, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎండీ బాషా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు


చికిత్సపొందుతున్న భవిత, చిన్నారి సృజన, కాశీరాం

పత్తికొండ రూరల్: పత్తికొండ-చిన్నహుల్తి రోడ్డులోని శ్రీరామ హాస్పిటల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. దైవదర్శనానికి మంత్రాలయం వెళ్లి చిన్నహుల్తి వైపు నుంచి పత్తికొండకు ఆటోలో వస్తుండగా ఎదురుగా దేవనబండ గ్రామానికి చెందిన యువకుడు కాశీరాం బైక్‌పై వస్తున్నాడు. అకస్మాత్తుగా కుడివైపున డాబా వైపునకు బైక్‌ను ఆటోకు అడ్డంగా తిప్పడంతో జరిగిన ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ నాగేంద్రతో పాటు భవిత, ఆమె కుమార్తెలు సృజన, మేధస్వి, తమ్ముడు మంజునాథ్ గాయాలపాలయ్యారు. బైక్‌పై వస్తున్న యువకుడు కాశీరాం తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సలహా మేరకు భవిత, చిన్నారి సృజన, యువకుడు కాశీరాంలను కర్నూలుకు తరలించారు.

## ప్రాణం తీసిన విద్యుత్ వైర్ల ఉచ్చు

- బుగ్గానిపల్లెలో మేకలకాపరి మృతి


పిట్టల మాదన్న (ఫైల్)

బేతంచెర్ల: అడవి పందుల కోసం పెట్టిన విద్యుత్ వైర్ల ఉచ్చు మేకల కాపరిని బలి తీసుకుంది. ఈ దుర్ఘటన బుగ్గానిపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పిట్టల మాదన్న (49) మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గ్రామ సమీపాన ఉన్న గోధుమారు ఎల్లమ్మ ఆలయం వైపు మేకలను మేపేందుకు వెళ్లాడు. గ్రామానికి చెందిన జయరాముడు, వెంకట్రాముడు, మధు.. అడవి పందుల కోసం విద్యుత్ వైర్లను పంటపొలాల సమీపాన ఉంచారు. సాయంత్రం తిరిగి వచ్చే సమయంలో వాటిని గమనించకుండా పిట్టల మాదన్న విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఉచ్చు ఉంచిన వారు రాత్రి ఈ విషయాన్ని గమనించి, తమపై నేరం పడకుండా మృతదేహాన్ని ముదిగేటమ్మ పొలాల సమీపాన రైల్వే ట్రాక్ పక్కన్న మట్టిలో పూడ్చి వేశారు. మేకలు ఇంటికి వచ్చినా మాదన్న రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. బుధవారం ముదిగేటమ్మ పొలాల పక్కన గుంత ఉండటంతో అనుమానం వచ్చి చూడగా మాదన్న మృతదేహం కనిపించింది. సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.